నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 23 ఏప్రిల్ 2025 | VIKARABAD

# ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి

## మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ఇంద్రారెడ్డి సమాధి వద్ద పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, కుటుంబసభ్యులు

చేవెళ్ల రూరల్/చేవెళ్ల టౌన్, ఏప్రిల్ 22 : మాజీ హోంమంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇంద్రారెడ్డి 25 వర్ధంతిని పురస్కరించుకుని చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల లోని ఇంద్రారెడ్డి సమాధి వద్ద కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డితో కలిసి సబితాఇంద్రారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు ఇంద్రారెడ్డినగర్, చిట్టంపల్లిగేట్ వద్ద, చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహాలకు నివాళుర్పించారు. అనంతరం నాంచేరు గ్రామ రెవెన్యూలోని బీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళుర్పించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ కెరటం, తెలంగాణ ఉద్య మంలో కీలక పాత్ర పోషించిన ఇంద్రారెడ్డి సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ఇంద్రారెడ్డి అందరి నుంచి దూరమై 25 ఏండ్లు కావొస్తున్నా ఇంకా ప్రజల గుండెల్లోనే ఉన్నాడన్నారు. పేదల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజల గుండెల్లో ఇంద్రారెడ్డి కుటుంబం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, వికారాబాద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అంజన్‌గౌడ్, బీఆర్‌ఎస్ చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల అధ్యక్షులు ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ప్రసాద్, కౌకుంట్ల, అంతారం మాజీ సర్పంచ్‌లు సులోచన, గాయత్రి, నరహరిరెడ్డి, ప్రభాకర్, శివారెడ్డి, హన్మంత్‌రెడ్డి, జహంగీర్, మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమల్ల ఆంజనేయులు, ఎంపీటీసీ సత్యనారాయణచారి, చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు గిరిధర్‌రెడ్డి, నర్సింహులు, మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, మహేశ్, సాయినాథ్, యాదగిరి, మాణిక్యం, మహేందర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, భాస్కర్, శేరి రాజు, సుదర్శన్, వీరాజంనేయులు, రాము, నవీన్, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ రజతోత్సవాన్ని సక్సెస్ చేద్దాం..

ఈనెల 27న వరంగల్‌లో జరుగనున్న బహిరంగ సభకు చేవెళ్ల నుంచి భారీగా తరలివెళ్లి సక్సెస్ చేద్దామని సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె కౌకుంట్లలో మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, ప్రజలు దండులా తరలివెళ్దామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపితే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అట్టడుగుకు తీసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు.



నీళ్లు లేక ఎండిపోయిన వరి పంట

# రెండు బోర్లు వేసినా..ఫలితం లేదు..

తాండూరు, ఏప్రిల్ 22 : ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు కాంగ్రెస్ పాలనలో కన్నీరే మిగులుతున్నది. ఇన్ని ఏండ్లుగా రాని కరువు ఇప్పుడే వచ్చి మా బతుకులను ఆగం చేస్తున్నది. నాకున్న రెండెకరాల సొంత పొలంతోపాటు మరో మూడెకరాలను కౌలుకు తీసుకుని వరిని సాగు చేశా. పంట చేతికొచ్చే సమయంలో భూగర్భజలాలు తగ్గి బోరు నుంచి నీళ్లు రావడం లేదు. పంటను కాపాడుకునేందుకు రెండు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. దిక్కుతోచక ఆ ఐదు ఎకరాల వరి పంటను పశువులకు మేతగా వదిలేశా. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ ఇచ్చినట్టు కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి రెతుభరోసా పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. రూ. లక్షలు అప్పు తెచ్చి పంటను సాగు చేయగా.. పంట మొత్తం ఎండిపోవడంతో కన్నీరు వస్తున్నది. తీసుకొచ్చిన అప్పులను ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. కుటుంబ పోషణా భారంగా మారింది. రైతుల బాధలు తీరాలంటే కేసీఆరే మళ్లీ సీఎం కావాలి. సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చని హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలేదు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధుతో వ్యవసాయం పండుగలా సాగింది. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో చాలా ఇబ్బందిగా మారింది.



-కుర్వ శ్రీనివాస్, రైతు, తిమ్మాయిపల్లి, తాండూరు



# పెరిగిన ఉత్తీర్ణతాశాతం

## ఇంటర్ ఫలితాల్లో వికారాబాద్ జిల్లాలో 63.13 శాతం పాస్

- గతేడాదితో పోలిస్తే అధికం..
- గత సంవత్సరంలో 61 శాతమే..
- ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 59.52 శాతం పాస్
- ద్వితీయ సంవత్సరంలో 67.29 శాతం..
- మే 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- సప్లిమెంటరీ పరీక్షా ఫీజు చెల్లింపునకు ఈనెల 30 వరకు గడువు

వికారాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏటా కూడా వారిదే హవా కొనసాగింది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో 63.13% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. రాష్ట్ర స్థాయిలో జిల్లా 28వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏటా ఉత్తీర్ణతాశాతం పెరగడం గమనార్హం. గతేడాది 61% మేర విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కాగా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 59.52%, ద్వితీయ ఏడాదిలో 67.29% ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది ఉత్తీర్ణతాశాతం గతేడాదితో పోలిస్తే తగ్గింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రత్యేక శ్రద్ధ చూపి నా అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయారు. మరోవైపు మే 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. సప్లిమెంటరీ పరీక్షా ఫీజు చెల్లింపునకు ఈనెల 30 వరకు గడువు విధించినట్లు ఇంటర్‌బోర్డు అధికారులు వెల్లడించారు.

### ఉత్తీర్ణులైన విద్యార్థులు..9,482 మంది

జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 14,703 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 9,482 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌ద్వితీయ సంవత్సరంలో 5,589 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 67.29% ఉత్తీర్ణతతో 3,761 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. అందులో బాలురు 2,478 మందిలో 1,480(59.73 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల్లో 3,111 మంది పరీక్షలు రాయగా 2281 (73.32%) మంది పాస్ అయ్యారు.

అదేవిధంగా ఇంటర్ మొదటి ఏడాది పరీక్షా ఫలితాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో జిల్లా 16వ స్థానంలో నిలవగా 59.52% మేర విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి ఏడాది పరీక్షలకు 6,418 మంది విద్యార్థులు హాజరుకాగా 3,820మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో 66.94% ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో ఉండగా, 50.76%తో బాలురు ఉన్నారు. మొదటి ఏడాదిలో 3,475 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 2,326 మంది పాస్ అయ్యారు. అదేవిధంగా 2,943 మంది బాలురు పరీక్షలు రాయగా 1494 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్ వొకేషనల్ మొదటి ఏడాదిలో 1,496 మంది స్టూడెంట్స్ ఎగ్జామ్స్ రాయగా 1,032(68.98%) మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో బాలురు 548 మందిలో 278 (50.73%) మంది ఉత్తీర్ణులు కాగా.. బాలికల్లో 948 మంది పరీక్షలకు హాజరుకాగా 754(79.54%) మంది ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా వొకేషనల్ రెండో ఏడాది ఫలితాల్లో 1,200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 869 (72.42%) మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 438 బాలురు పరీక్షలకు హాజరుకాగా 48.86%తో 214 మంది బాలురు, 762 బాలికల్లో 85.96%తో 655 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు.

### రంగారెడ్డి జిల్లాలో 77.72% ఉత్తీర్ణత

రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 77.72% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. మొదటి సంవత్సరంలో 76.95% మంది పాస్‌అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ద్వితీయ స్థానంలో ఉం డగా.. రెండో సంవత్సరంలో నాలుగో స్థానంలో నిలిచింది. మొదటి ఏడాదిలో 76,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 59, 227 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాదిలో 66,586 మంది పరీక్షలు రాయగా 52,526 మంది పాస్ అయ్యారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో ఉత్తీర్ణతాశాతం తగ్గింది. గతేడాది రాష్ట్రస్థాయిలో జిల్లా రెండోస్థానంలో ఉండగా ఈ ఏడాది నాల్గో స్థానానికి పడిపోయింది.



- పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపు
- జిల్లాలోని పల్లెల్లో ప్రారంభమైన గులాబీ పండుగ సందడి
- సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్న రైతులు, మహిళలు, అభిమానులు

# ఇంటికో జెండా.. గ్రామానికో బస్సు..

## వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవానికి భారీగా తరలివెళ్దాం

బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ ఈనెల 27న వరంగల్‌లో జరుగనుండడంతో జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో పండుగ సందడి నెలకొన్నది. సభను సక్సెస్ చేసేందుకు ఇంటికో జెండా.. గ్రామానికో బస్సుతో భారీగా తరలివెళ్తామని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన నమస్తే తెలంగాణ ప్రతినిధితో మాట్లాడుతూ.. బహిరంగ సభకు మహిళలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలిచ్చిన విషయాన్ని ప్రజలందరూ గ్రహించారని.. రేవంత్ సర్కార్ 16 నెలల పాలనపై అన్ని వర్గాల ప్రజలు కోపంతో, ఆగ్రహంతో ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్‌ఎస్ పార్టే శ్రీరామ రక్ష అని భావిస్తున్నారని పేర్కొన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నరలోనే తన నిజస్వరూపాన్ని బయట పెట్టిందన్నారు. రైతుభరోసా ఇవ్వకుండా రైతులను.. మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా మహిళలను, తులం బంగారం ఇవ్వకుండా పేదింటి ఆడపిల్లలను, ఉద్యోగాలివ్వకుండా యువతను, అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశవర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది ఇలా అన్ని వర్గాల వారిని మోసం చేసిందన్నారు. మోసానికి గురైన ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు.

-రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ)

### ప్రతి ఇంటిపైనా గులాబీ జెండాను ఆవిష్కరించాలి

ఈనెల 27న వరంగల్‌లో జరుగనున్న రజతోత్సవ మహాసభ సందర్భంగా ప్రతి ఇంటిపైనా బీఆర్‌ఎస్ శ్రేణులు గులాబీ జెండాను ఆవిష్కరించాలి. బహిరంగ సభకు భారీగా తరలేందుకు ప్రతి గ్రామానికి బస్సుతోపాటు కార్లు, ఇతర వాహనాలను అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా బహిరంగసభకు తరలే ముందు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ ఇండ్లతోపాటు గ్రామాల్లోనూ బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించాలి.

### ఏర్పాట్లు పూర్తి..

రజతోత్సవ సభకు నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులంతా భారీగా తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే మండల, నియోజకవర్గస్థాయి సమావేశాలతోపాటు సమన్వయ కమిటీ మీటింగ్‌లనూ పూర్తి చేశాం. ప్రతి గ్రామానికొక టీమ్ లీడర్‌ను ఏర్పాటు చేశాం. అతడు బహిరంగ సభకు వెళ్లే వారి కోసం బస్సుతోపాటు ఇతర వాహనాలను అందుబాటులో ఉంచడంతోపాటు.. ప్రజలు, మహిళలు, అభిమానులు, పార్టీ శ్రేణులను బహిరంగ సభకు తీసుకెళ్లి .. తిరిగి ఇండ్లకు తీసుకొస్తాడు. అంతేకాకుండా బహిరంగ సభకు వెళ్లే వారి కోసం ఆయా బస్సుల్లో మంచినీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నాం.

### జిల్లా నుంచి 300 బస్సులు, 1200 కార్లు..

బహిరంగ సభకు జిల్లా నుంచి 300 ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ బస్సులతోపాటు 1000 నుంచి 1200 వరకు కార్లు బయలుదేరుతాయని అంచనా వేస్తున్నాం. ఉదయం 9 గంటల నుంచే గ్రామాల నుంచి బహిరంగ సభకు వాహనాలు బయలుదేరాలని.. అవి బయలుదేరే ముందే ప్రతి నాయకుడు, కార్యకర్త తమ ఇండ్లపై గులాబీ జెండాను ఎగురవేయాలి.

### జిల్లా నుంచి లక్ష మంది వస్తారని అంచనా..

రజతోత్సవ సభకు జిల్లా నుంచి లక్ష మంది వరకు తరలివచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నాం. ఇటీవల నిర్వహించిన మండల, నియోజకవర్గస్థాయి సమావేశాల్లో వచ్చిన ఉత్సాహాన్ని బట్టి చూస్తే లక్ష మందికి పైగానే వచ్చే అవకాశం ఉన్నది. ఈ బహిరంగ సభతో రాష్ట్రంలో పెను మార్పులు సంభవించే అవకాశాలున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేసే అవకాశాలున్నాయి. ఈ సభ రాష్ట్ర చరిత్రలోనే కొత్త మలుపు తిప్పనున్నది.




సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# దండులా కదులుదాం.. రజతోత్సవాన్ని సక్సెస్ చేద్దాం

## కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఏప్రిల్ 22 : వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు శ్రేణులు దండులా తరలిరావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో జరుగనున్న రజతోత్సవ మహాసభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సభకు నియోజకవర్గం నుంచి 35 ఆర్టీసీ బస్సులు, నాలుగు వందల వాహనాలతో భారీగా తరలివెళ్దామన్నారు. నియోజకవర్గంలోని 166 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలు, రెండు మున్సిపాలిటీల్లోని 37 వార్డుల్లో బీఆర్‌ఎస్ జెండాల ఆవిష్కరణకు దిమ్మెలను ఏర్పాటు చేశామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి అన్ని వాహనాలు కడ్తాల్ మండల కేంద్రానికి చేరుకుంటాయని అక్కడి నుంచి ర్యాలీగా వరంగల్ సభకు తరలివెళ్తాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయిలు, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, నాయకులు గంప శ్రీనుగుప్తా, కృష్ణ, సురేశ్, రామకృష్ణ, మహేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్డ్ నౌ మరింత జాప్యం

## ఇబ్బందుల్లో దరఖాస్తుదారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగంపై తాటి కాయపడినట్లుగా మారింది. సంస్కరణల పేరిట కాంగ్రెస్ సర్కార్ తీసుకుంటున్న చర్యలు భవన నిర్మాణ రంగంలో మరింత అధ్వానంగా మారుతున్నాయి. ఏఐ ఆధారిత వ్యవస్థతో వేగంగా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియకు సంస్కరణలు చేసిన ప్రభుత్వం..అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయడంలో విఫలమైంది. చురుగ్గా అనుమతులు దేవుడెరుగు కనీసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటే చాలనే పరిస్థితి హెచ్‌ఎండీఏ పరిధిలో నెలకొన్నది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతుల ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే వేగంగా పూర్తి చేసేలా టీఎస్-బీపాస్‌ను తీసుకొచ్చి సమర్థవంతంగా అమలు చేసింది. కానీ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ టీఎస్-బీపాస్ లోపభూయిష్టంగా ఉందని, మరింత పారదర్శకత, వేగవంతమైన అనుమతుల కోసం బిల్డ్‌నౌను ప్రారంభిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో కొత్త విధానం పూర్తి స్థాయిలో సిద్ధం కాకుండానే, పాత విధానాన్ని నిలిపివేయడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. 11 జిల్లాలకు విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిలో ఏప్రిల్ మొదటి వారంలోనే బిల్డ్ నౌ అందుబాటులోకి వస్తుందని అధికారులు వెల్లడించారు. కానీ, అప్లికేషన్ పనితీరులో వస్తున్న లోపాలను సవరించడానికే సమయం పడుతున్నది. దీంతోనే అప్లికేషన్ అందుబాటులోకి రాలేదని, ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలవుతున్నా...ఇందులో వస్తున్న షార్ట్ ఫాల్స్, సెక్యూరిటీ, పనితీరులోని లోపాలను సవరిస్తున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో అప్లికేషన్ సిద్ధం కాకుండానే అమలు చేస్తే వచ్చే ఇబ్బందులతో మరిన్ని సమస్యలు వస్తాయని చెబుతున్నారు. దీనిపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఇప్పటివరకు నిర్వహించలేదు. కనీసం సిబ్బందికి పనితీరుకు శిక్షణ శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయలేదు.

# ఉచితంగా అవయవ మార్పిడి

సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట : పేద రోగులకు ఉచితంగా అవయవ మార్పిడి చేసేందుకు గాంధీ ఆసుపత్రి సిద్ధమవుతున్నది. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఆశయానికి అవయవ మార్పిడి కేంద్రం జీవం పోయనున్నది. కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో నిర్మించిన ఆరు థియేటర్లు త్వరలోనే ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. గాంధీలో నోడల్ అవయవదాన మార్పిడి కేంద్రాన్ని రూ. 35 కోట్లతో నెలకొల్పేందుకు 2022లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదలు కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు వంటి అవయవ మార్పిడికోసం రూ. లక్షల్లో అప్పులు చేసి కార్పొరేట్ దవాఖానలకు వెళ్లడాన్ని గమనించిన కేసీఆర్ అవసరమైన ప్రతి పేదోడికీ ఉచితంగా అవయవమార్పిడి సేవలందించాలని నిర్ణయించారు. నాటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు గాంధీ దవాఖానలోని 8వ అంతస్తులో అవయవమార్పిడి కేంద్రాన్ని ప్రారంభించేందుకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతానికి 95శాతం పనులు పూర్తికాగా మరో పదిహేను రోజుల్లో గాంధీలోని అవయవమార్పిడి కేంద్రం అందుబాటులోకి రానున్నది.

### అధునాతన ఆరు థియేటర్లు..

అవయవాల మార్పిడికోసం ఆరు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. ఒకేసారి మూడు వివిధ రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేయనున్నారు. పీజీ విద్యార్థులకు వైద్యవిద్యలో భాగంగా ఆపరేషన్ థియేటర్‌లో నిర్వహించే అవయవ మార్పిడి చికిత్సను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు.

మంగళ వారం ఒక్క రోజే 2064 మెట్రిక్ టన్నుల మామిడి విక్రయాలు

# పండ్ల మార్కెట్‌లో రికార్డు అమ్మకాలు

- వెయ్యి లారీల్లో వచ్చిన మామిడికాయలు
- రైతులు, వ్యాపారులతో కిటకిటలాడుతున్న బాటసింగారం పండ్ల మార్కెట్



బాటసింగారం పండ్ల మార్కెట్‌లో రాశులుగా మామిడి కాయల కుప్పలు


రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో మంగళవారం రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. ఈ మార్కెట్‌కు రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున మామిడి కాయలు వస్తున్నాయి. మంగళవారం ఒక్క రోజే సుమారు 900పైగా మామిడికాయల లారీలొచ్చాయి. ఈదురుగాలులు, వడగండ్లవానతోపాటు అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మామిడి రైతులు ముందుగానే కాయలను మార్కెట్‌కు తరలిస్తున్నారు. వ్యాపారులు, రైతులతో పండ్ల మార్కెట్ కిటకిటలాడింది. పెద్ద ఎత్తున మామిడికాయలు మార్కెట్‌కు రావడంతో ఆశించిన ధర పలకలేదని కొంతమంది రైతులు వాపోయారు.

### 2064 మెట్రిక్ టన్నుల క్రయవిక్రయాలు..

బాటసింగారం పండ్ల మార్కెట్‌లో మంగళవారం ఒక్క రోజే మామిడి సీజన్‌లోనే అత్యధికంగా అమ్మకాలు జరిగాయి. 2,064 మెట్రిక్ టన్నుల మామిడి క్రయవిక్రయాలు జరిగాయి. కొనుగోలు చేసిన మామిడికాయలను ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి పలు రాష్ట్రాలతో ఇతర దేశాలకూ ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌లో మామిడి విక్రయాలు ఊపందుకోవడంతో అధికారులు వ్యాపారులు, రైతులకు సౌకర్యాలను కల్పిస్తున్నారు. అకాల వర్షాలతో మామిడి కాయ లు నేల రాలడంతోపాటు దెబ్బతింటున్నాయనే రైతులు ముందుగానే మార్కెట్‌కు తీసుకొస్తుండడంతో సందడి మొదలైంది. కాగా మామిడి కాయలను తీసుకొచ్చిన రైతు లకు గిట్టుధర ఇప్పించేందుకు కృషి చేస్తా మని మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.



### గిట్టుబాటు ధర రావడం లేదు..



మార్కెట్‌కు ఒకేసారి పెద్ద ఎత్తున మామిడి కాయలు వస్తుండడంతో రైతులకు ఆశించిన మేర గిట్టుబాటు ధర రావడం లేదు. అకాల వర్షాలు, వడగండ్ల వాన వంటి పరిణామాల నేపథ్యంలో ముందుగానే రైతులు మామిడి కాయలను మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. రూ.50 నుంచి రూ.60లకు అమ్ముడు పోతాయనుకున్న మామిడి కాయలు మంగళవారం రూ.35 నుంచి రూ.40 వరకు మాత్రమే వచ్చాయి.

-వెంకట్‌రెడ్డి, రైతు